క్లుప్తంగా

మర్యాదపూర్వక భేటీ



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్‌ను కలిసిన అబ్బయ్యచౌదరి, జయప్రకాష్

దెందులూరు: వైఎస్సార్‌సీపీ ప్రధాన నేతలు ఆదివారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ కలుసుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావుతో దెందులూరు, ఏలూరు నియోజకవర్గంలో పరిస్థితులను అబ్బయ్యచౌదరి, జేపీ వివరించారు.

జిల్లాస్థాయి ఆటల పోటీల్లో ఉపాధ్యాయుల ప్రతిభ



గెలుపొందిన ఉపాధ్యాయులు

దెందులూరు: ఉపాధ్యాయులు జిల్లాస్థాయి ఆటల పోటీల్లో దెందులూరు మండలం, పోతునూరు, కొవ్వలి ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ప్రతిభ కనబరిచారని ఎంఈఓ ఏపీ ఎన్‌వీ ప్రసాద్, కె.అన్నమ్మ అన్నారు. ఆదివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ ఈ నెల 29, 30 తేదీల్లో ఏలూరు జిల్లా క్రీడా సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగుల ఆటల పోటీలు నిర్వహించారని తెలిపారు. విజేతలైన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

పంట కాలువల్లో పేరుకుపోయిన తూడు



గోదావరి కాలువలో పెరిగిన తూడు

దెందులూరు: గోదావరి కాలువలో తూడు పేరుకుపోయింది. కాలువలో నీరు సంతృప్తికరంగా ఉన్నప్పటికీ తూడు విపరీతంగా పేరుకుపోవడంతో సాగు నీటి ప్రవాహానికి ఆటంకంగా మారిందని రైతులు అంటున్నారు. ఏటా కృష్ణా, గోదావరి కాలువల్లో తూడు పెరగడం, సాగుకు ముందు తూడును తొలగించడం పరిపాటి. కృష్ణా కాలువలో కిలోమీటర్ల పరిధిలో తూడు పేరుకుపోతే గత నెలలో రైతుల తొలగించారు. తూడు సమస్యకు పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా గంగానమ్మకు జలాభిషేకం



పెదపాడులోని గంగానమ్మవారు

పెదపాడు: పెదపాడులోని గంగానమ్మ జలాభిషేకం మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పెదపాడులోని గండిచెరువుగట్టు నుంచి పెదపాడు బళ్లరేవుతూము సెంటర్ మీదుగా గంగానమ్మ ఆలయం వద్దకు 108 నీళ్ల బిందెలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. తొలుత ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

చురుగ్గా నూతన రామాలయ నిర్మాణం



గంగన్నగూడెంలో నిర్మిస్తున్న రామాలయం

దెందులూరు: గంగన్నగూడెంలో శిథిలావస్థకు చేరిన పాత రామాలయం స్థానంలో నూతన ఆలయాన్ని ఆలయ కమిటీ నిర్మిస్తోంది. పూర్తి నాణ్యత ప్రమాణాలతో భక్తులకు అనుకూలంగా ఉండేందుకు రామాలయాన్ని నిర్మిస్తున్నట్టు కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. మండలం పరిధిలోని పురాతన ఆలయాల్లో గంగన్నగూడెం రామాలయం ఒకటి. త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేస్తామని కమిటీ సభ్యులు వివరించారు.

మోటార్ సైకిళ్లపై శివక్షేత్రాల దర్శనం

దెందులూరు: ఈ నెల 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా మోటార్ సైకిళ్లపై ఆరు శివ క్షేత్రాల దర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్టు రామదండు కమిటీ తెలిపింది. 15వ తేదీ ఉదయం 5 గంటలకు 200 మోటార్ సైకిళ్లతో ర్యాలీగా వెళతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొంటారని తెలిపారు.

స్వీయ మూల్యాంకన పరీక్షలకు సంసిద్ధం

- నేటి నుంచి 8వ తేదీ వరకూ
- రోజుకు రెండు పరీక్షలు నిర్వహణ
- మండల కేంద్రాలకు చేరుకున్న ప్రశ్నాపత్రాలు

నిడమర్రు: పాఠశాల విద్యలో ఏటా విద్యార్థుల విద్యా సామర్థ్యాలను అంచనా వేసేందుకు నిర్వహించే యూనిట్ పరీక్షల్లో భాగంగా స్వీయ మూల్యాంకనం-2 (రెండవ యూనిట్) పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయినట్టు ఎంఈవో-1 పుచ్చల శేషు తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ ద్వారా ఎంఈవో కార్యాలయాలకు అందాయన్నారు. వాటిని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వారీగా సీల్ చేసిన ప్రశ్నాపత్రాల కట్టలను విభజిస్తున్నామన్నారు. సోమవారం నుంచి 8వ తేదీ వరకూ ఆయా స్కూళ్లలో నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గతంలో ఈ యూనిట్ పరీక్షలను నిర్మాణాత్మక మూల్యాంకనం (ఎఫ్ఏ) పేరుతో నిర్వహించేవారమని ఈ విద్యా సంవత్సరం నుంచి ఈ పరీక్షల పేరును స్వీయ మూల్యాంకనం పేరుతో ఈ నాలుగు పరీక్షలు నిర్వహిస్తున్నారు. 1,3 పరీక్షలు ఓఎంఆర్ బేస్డ్ పరీక్షలుగా, మిగిలినవి పాత పద్ధతిలో ప్రశ్నా జవాబు మాదిరిగా నిర్వహించనున్నారు.

రోజుకు రెండు పరీక్షలు నిర్వహణ

ఆగస్టులో నిర్వహించిన స్వీయ మూల్యాంకనం-1 పరీక్షలను రోజుకు ఒక పరీక్ష చొప్పున 7 రోజులు నిర్వహించేలా షెడ్యూల్ ఇచ్చారు. అయితే పరీక్షలు ప్రారంభించిన తర్వాత వరస తుఫాన్ల కారణంగా పరీక్షల షెడ్యూల్లో అనేక మార్పులు చోటు చేసుకుని సెప్టెంబరు మొదటి వారం వరకూ ఈ పరీక్షలు కొనసాగాయి. 20 మార్కుల యూనిట్ పరీక్షలను రోజుకు ఒక పరీక్ష చొప్పున నిర్వహించేలా రూపొందించిన షెడ్యూల్‌పై ఉపాధ్యాయుల్లోనూ వ్యతిరేకత వ్యక్తమైంది. సంబంధిత సిలబస్ పూర్తి చేయడంలో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. రేపటి నుంచి నిర్వహించే స్వీయ మూల్యాకనం పరీక్షలను రోజుకు రెండు పరీక్షల చొప్పున 3 రోజుల్లో పూర్తి చేసేలా అధికారులు షెడ్యూల్ ప్రకటించారు.



నిడమర్రు ఎంఈవో కార్యాలయంలో ప్రశ్నాపత్రాలను విభజిస్తున్న సిబ్బంది

పరీక్షల షెడ్యూల్ ఇలా...

సోమవారం 3 నుంచి 10 తరగతి వరకూ ఒకేషనల్ లాంగ్వేజ్‌పై పరీక్ష ఉంటుంది. 5న నాగుల చవితి సందర్భంగా పరీక్ష లేదు. 1 నుంచి 5వ తరగతుల వారికి 6న తెలుగు, గణితం, 7న పరిసరాల విజ్ఞానం, ఇంగ్లీషు పరీక్షలు ఉంటాయి. ఆయా రోజుల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకూ ఒక పరీక్ష, మధ్యాహ్నం 1.10 నుంచి 2.10 గంటల వరకూ రెండో పరీక్ష నిర్వహిస్తారు. 6 నుంచి 8వ తరగతి వారికి మధ్యాహ్నం 1.10 నుంచి 2.10 గంటల వరకూ ఒక పరీక్ష, 2.10 నుంచి 3.20 వరకూ రెండో పరీక్ష ఉంటుంది. 6న తెలుగు, గణితం, 7న హిందీ, సైన్స్, 8న ఇంగ్లీషు, సోషల్ పరీక్షలు ఉంటాయి. ఇదే తేదీల్లో 9,10 తరగతుల వారికి ఉదయం 10 నుంచి 11 గంటల వరకూ ఒక పరీక్ష, 11.15 నుంచి 12.15 వరకూ రెండో పరీక్షలు ఉండేలా షెడ్యూల్ ప్రకటించారు.



పరీక్షలు రాస్తున్న కొమ్మర విద్యార్థులు (ఫైల్)

టోఫెల్ పరీక్షలకు మంగళం

పేద విద్యార్థులకు ఇంగ్లీషు భాషపై పట్టు సాధించేందుకు గత ప్రభుత్వ 3 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన టోఫెల్ పరీక్షలకు కూటమి ప్రభుత్వ మంగళం పాడింది. ఆగస్టు వరకూ పాఠశాలల్లో టోఫెల్ తరగతులు నిర్వహించారు. అనంతం విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్ -2024-25లో టోఫెల్ తరగుతుల నిర్వహణకు పీరియడ్స్ కేటాయించకపోవడంతో ఉపాధ్యాయులు పాఠశాలల్లో టోఫెల్ తరగతులు నిర్వహణను నిలిపివేశారు. దీంతో గతంలో ఎఫ్ఏ-1 పరీక్షల మాదిరిగా ఈ స్వీయ మూల్యాంకనం పరీక్షల్లో టోఫెల్ పరీక్షలు విద్యార్థులకు లేవు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టోఫెల్‌కు సంబంధించిన కంటెంట్, ప్రభుత్వ పాఠశాలలకు అందించిన స్మార్ట్ టీవీలు, డిజిటల్ బోర్డుల్లో ఉంది. ఎక్కడా ఈ టోఫెల్ తరగతులు నిర్వహించడంలేదు.

పరీక్ష రోజే ప్రశ్నాపత్రాల పంపిణీ



ఆయా పరీక్ష నిర్వహించే రోజే ప్రశ్నాపత్రాలు పాఠశాలల సముదాయాల హెచ్‌ఎంల ద్వారా పాఠశాలలకు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రశ్నాపత్రాలు వాట్సప్‌లో ముందుగా పంపినట్లు తెలిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించేలా హెచ్‌ఎంలు బాధ్యత వహించాలి.

– పుచ్చల శేషు, ఎంఈవో-1, నిడమర్రు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఉంగుటూరు: మండలంలోని నాచుగుంటకు చెందిన నెక్కలపూడి రమణయ్య (33) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. చేబ్రోలు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఇలా ఉన్నాయి. నాచుగుంటకు చెందిన రమణయ్య ఉంగుటూరుకు చెందిన శిరీషను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీళ్లకి ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో నాచుగుంటలో ఏఎన్ఎంగా పనిచేస్తున్న మహిళతో రమణయ్యకు పరిచయం ఏర్పడింది. ఇటీవల ఆమె ఉంగుటూరులో నివసించడంతో రమణయ్య కూడా అదే గ్రామంలో కిళ్లీ కొట్టు పెట్టుకుని ఉంటున్నాడు. దీంతో భార్య శిరీష, ఏఎన్ఎంల మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో మనస్థాపం చెందిన రమణయ్య గత 17న ఉంగుటూరులో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో అతనిని ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి ఏఎన్ఎం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై సూర్యభగవాన్ తెలిపారు.

40 మద్యం సీసాలు పట్టివేత

ఉంగుటూరు: ఎ.గోకవరం గ్రామంలో అక్రమంగా 40 క్వార్టరు మద్యం సీసాలు తరలిస్తున్న మారిశెట్టి శ్రీనుని అదుపులోకి తీసుకున్నట్లు చేబ్రోలు ఎస్సై సూర్య భగవాన్ ఆదివారం తెలిపారు. గ్రామ శివారులో అక్రమంగా మద్యం తరలిస్తున్నారని సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసి శ్రీనుని అదుపులోకి తీసుకుని, మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు. నిందితుడిని కోర్టుకు హాజరుపరుస్తామని ఎస్సై వివరించారు.

ఇన్‌చార్జుల స్థానాలను భర్తీ చేయాలి

దెందులూరు: ప్రభుత్వ శాఖల్లోని వివిధ పోస్టుల్లో ఇన్‌చార్జిలు కొనసాగడంతో పాలనాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సత్వర సేవలు అందడం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. దెందులూరు మండలంలో వివిధ పోస్టుల్లో ఇన్‌చార్జులు కొనసాగుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాలుగు నెలలు పూర్తయినప్పటికీ చాలా పోస్టుల్లో ఇంకా ఇన్‌చార్జులే కొనసాగుతున్నారు. సివిల్ సప్లయ్ అసిస్టెంట్, సబ్ ఇన్‌స్పెక్టర్, మండల వ్యవసాయ శాఖాధికారి, మండల పంచాయతీ విస్తరణ అధికారి, మండల మత్స్యశాఖ అధికారి, బాలసదనం సూపరింటెండ్, ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్, దెందులూరు గ్రామ కార్యదర్శి, కొవ్వలి గ్రామ కార్యదర్శి, కొత్తగూడెం గ్రామ కార్యదర్శి, పోతునూరు వీఆర్వో -2, కొవ్వలి వీఆర్వో -1, దెందులూరు వీఆర్వో -3, శ్రీరామవరం వీఆర్వో, రామారావుగూడెం వీఆర్వో, జోగన్నపాలెం వీఆర్వో, దెందులూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, పోతునూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, పోతునూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, చల్లచింతలపూడి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, పీహెచ్‌సీలు, ఏఎన్‌ఎంల పోస్టులు ఎంతోకాలంగా ఖాళీగా ఉన్నాయి. వారి స్థానాల్లో ఇన్‌చార్జులు నియమించి వారితోనే కాలం వెళ్లదీస్తున్నారు. ప్రజలకు, ఉద్యో గులు అందుబాటులో ఉండటం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో రెండు పోస్టుల పని భారంతో న్యాయం చేయలేకపోతున్నామని ఉద్యోగులు అంటున్నారు.ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఖాళీగా ఉన్న పోస్టుల స్థానంలో ఉద్యోగులను భర్తీ చేయాలని వారు కోరుతున్నారు. ఈ బాధలు భరించలేక కొంతమంది ఉద్యోగులు సెలవులు పెడుతున్నారు. కీలకమైన ఉద్యోగాల్లోనూ ఇన్‌చార్జులను నియమిస్తే ప్రభుత్వ పరంగా ఆ శాఖలకు సంబంధించి విధి నిర్వహణ ఎలా కొనసాగుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

భీమడోలు: ప్రపంచ శాకాహార దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పిరమిడ్ సేవాదళ్ మండల అధ్యక్షుడు అప్పన్న ఆధ్వర్యంలో శాకాహార ప్రియులు, పిరమిడ్ సేవాదళ్ సభ్యులు భారీ సంఖ్యలో ర్యాలీని నిర్వహించారు. భీమడోలు సాయిబాబా ఆలయం వద్ద సీనియర్ పిరమిడ్ మాస్టార్లు వరలక్ష్మి, గోవిందయ్య జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ప్లకార్డులను చేత పట్టుకుని మానవుల ఆహారం శాకాహారమని, శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని నినాదాలు చేశారు. పలు కూడళ్ల వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి, గోవిందయ్య మాట్లాడుతూ ఈనెల 11న ప్రతీజీ జయంతిని పురస్కరించుకుని అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పిన్నింటి అప్పారావు, పంట్ల రాము, అనుపోజు రంగారావు, ఈడే గిరిబాబు, ఈతకోట సుబ్బారావు పాల్గొన్నారు.



ర్యాలీ, ప్రదర్శన చేస్తున్న శాకాహార ప్రియులు

ఆదివాసీ వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

బుట్టాయగూడెం: అమర వీరుల ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ఆదివాసీ వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పోరండ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా నాగన్నగూడెంలో అమరుడు నాగన్న, గంగిరెడ్డిల స్థూపం వద్ద కుర్సం లత అధ్యక్షతన ఆదివారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం, అటవీశాఖామంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల అడవులను విస్తరిస్తామని ప్రకటన చేశారని, ఆ ప్రకటనలో ఆదివాసీ భూములను కలుపుకుని వారిని అడవుల నుంచి గెంటివేసే కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ప్రధానంగా గోదావరీ పరీవాహక ప్రాంతాల్లో ఆదివాసీలు లక్షల ఎకరాల్లో పోడు కొట్టుకుని జీవనం సాగిస్తున్నారని అన్నారు. పాలకవర్గాల వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృతం చేయడమే అమరవీరులకు అర్పించే నిజమైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారెడ్డి, బాబులురెడ్డి, పండురెడ్డి, శ్రీరామ్మూర్తి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నాగన్నగూడెంలో అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా నినాదాలు చేస్తున్న దృశ్యం

22న మాదిగల ఆత్మీయ సమ్మేళనం

ఏలూరు (టూటౌన్): ఈ నెల 22న ఏలూరులో నిర్వహించనున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాదిగల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నేతలు కోరారు. ఈమేరకు ఆదివారం ఏలూరు ఇశ్రాయేలు పేటలోని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎంఆర్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషా మాదిగ ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టాన్ని అమలు చేయకుండా ఉద్యోగ నియామకాలు, ప్రకటనలు చేపట్టరాదని, ఎస్సీ వర్గీకరణ వేగంగా అమలు చేయించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



సన్నాహక సమావేశంలో పాల్గొన్న నాయకులు

తెలుగు మాధ్యమంలో పరీక్షలు రాసేందుకు అవకాశం ఇవ్వాలి

ఏలూరు (టూటౌన్): వచ్చే మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తెలుగు మాధ్యమంలో కూడా పరీక్షలు రాసుకునే అవకాశం కల్పించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలని, విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి పాఠశాలలోనూ ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేటట్లుగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆన్‌లైన్ పనుల భారం తగ్గించి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. వివిధ కేడర్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలు తక్షణమే రూపొందించాలని డీఈఓని మరోసారి సంఘ తరపున కోరతామని తెలిపారు.

వైభవంగా కార్తీక మాసోత్సవాలు



మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున రుద్రాక్షలు, పసుపుకొమ్ములతో ప్రదర్శన



గుండుగొలనులో భ్రమరాంబికా మల్లేశ్వర వార్ల భారీ ఊరేగింపు

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి, అమ్మవార్లకు లక్ష రుద్రాక్షల పూజ, శుక్రవారం లక్ష పసుపు కొమ్ముల పూజలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆలయ పూజారి లంకా శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు విశేషంగా అలంకరించిన స్వామి, అమ్మవార్ల మందిరాన్ని పల్లకిపై ఉంచి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు తమ నెత్తిన పసుపు కొమ్ములు, రుద్రాక్షలను పెట్టుకుని శివనామస్మరణతో, కోలాట నృత్యాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు.

కనుల వేడుకగా దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ



గుండుగొలను బీసీ కాలనీలోని అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

భీమడోలు: గుండుగొలనులోని బీసీ కాలనీలో వేంచేసియున్న కనకదుర్గమ్మ ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని కనుల వేడుకగా నిర్వహించారు. రెండు రోజులుగా కొనసాగుతున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలు, విగ్రహ ప్రతిష్ఠతో ఆదివారం ఘనంగా ముగిశాయి. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో జీర్ణోద్ధరణ చెందిన అమ్మవారి విగ్రహం స్థానంలో నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ పూజారి లంకా శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో పూజారుల బృందం శాస్త్రోక్తంగా పూజలు, హోమం నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారికి దర్శించుకుని పూజలు చేశారు.

దివ్యాంగులను ఆదుకోవడం అభినందనీయం

భీమడోలు: ప్రతి ఒక్కరూ మానవత్వం కలిగి ఆదర్శవంతంగా జీవించాలని పలువురు వక్తలు అన్నారు. గుండుగొలనులోని విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం 60 మంది దివ్యాంగులకు నెలవారీ వితరణ కార్యక్రమం నిర్వహించారు. భీమవరానికి చెందిన కూచిపూడి నెహ్రూ రాజా జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాజా ఆర్థిక సాయంతో దివ్యాంగులకు బియ్యం, పండ్లు అందజేశారు. గుండుగొలనుకి చెందిన కంకటాల కామరాజు ఆర్థిక సాయంతో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దివ్యాంగులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన దాతలు అభినందనీయులన్నారు. అనంతరం కార్తీక మాసోత్సవాల్లో భాగంగా భోజనాలు చేశారు. నిర్వాహకులు, పెద్దలు పాల్గొన్నారు.



గుండుగొలనులో దివ్యాంగులకు పండ్లు, బియ్యం అందిస్తున్న దాత, పెద్దలు

వ్యాయామ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

దెందులూరు: గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని కలెక్టర్ కే వెట్రిసెల్వి చెప్పారు. ఆదివారం గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ కళాశాలను ఆమె ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి సందర్శించారు. కళాశాల హాస్టల్‌ను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థినులతో మాట్లాడి అనంతరం వారికి అవసరమైన సౌకర్యాలను ప్రిన్సిపల్ ద్వారా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు.ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ త్వరితగతిన భవనాన్ని నిర్మిస్తామన్నారు. ఆర్డీఓ అచ్యుత అంబరీష్, తహసీల్దార్ బి.సుమతి, టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్, ప్రిన్సిపల్ ఎస్.నత్తానియేలు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

'హైందవ శంఖారావం' కరపత్రం ఆవిష్కరణ



హైందవ శంఖారావం బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి చేసి హిందూ ధార్మిక సంఘాలకు అప్పగించాలనే డిమాండ్‌తో జనవరి 5న విజయవాడలో తలపెట్టిన హైందవ శంఖారావం భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్రరాజు వేణుగోపాల్ రాజు కోరారు. స్థానిక గ్రాండ్ కృష్ణ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన హైందవ శంఖారావం జిల్లా సన్నాహక సమావేశంలో బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశానికి శ్రీ యాజ్ఞవల్క్య రాజాశ్రమాధిపతులు కృష్ణచరణానందభారతీ స్వామి, విశ్వహిందూ పరిషత్ క్షేత్ర విధినిధి ప్రముఖ్ కస్తూరి సూర్య ప్రకాష్, ఏలూరు జిల్లా సంఘచాలక్ గడ్డమనుగు సత్యనారాయణ, వంశీకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ఇతర మత దేవాలయాలపై లేని ప్రభుత్వ పెత్తనం హిందూ ఆలయాలపై తగదని అన్నారు.